క్లుప్తంగా

ఆకట్టుకున్న దీపారాధన



గణనాథుని రూపంలో దీపారాధన

కోటవురట్ల: వినాయక నవరాత్రులు ముగియడంతో గణేశుని నిమజ్జనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పలు గ్రామాల్లో గణనాథుని విగ్రహాలను భారీ ఊరేగింపు మధ్య వరహానది, ఏలేరు కాలువల్లో నిమజ్జనం చేస్తున్నారు. కె.వెంకటాపురంలో గణనాథుని నిమజ్జనోత్సవం సందర్భంగా రంగవల్లుల పోటీ నిర్వహించి, దీపారాధన చేశారు. గణనాథుని ఆకృతిలో దీపారాధన విశేషంగా ఆకట్టుకుంది. రంగవల్లుల పోటీలో దేవాడ రమ్య ప్రథమ, తమరాన భవాని ద్వితీయ, కాళ్ల నూకరత్నం తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పైల శ్రీరామ్మూర్తి, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, గ్రామ అధ్యక్షుడు సత్యనారాయణ, యువకులు పాల్గొన్నారు.

5న తిమ్మరాజుపేటలో నేత్ర వైద్య శిబిరం

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో ఈ నెల 5న ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి సౌజన్యంతో, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, అనకాపల్లి జిల్లా శ్రీ సత్యసాయి సేవా సంస్థల సంయుక్త నిర్వహణలో ఈ శిబిరం జరగనుందన్నారు. ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే శిబిరంలో కంటి సమస్యలున్నవారు పాల్గొని తమ సమస్యల్ని తొలగించుకోవచ్చన్నారు. శ్రీ సత్యసాయి భజన మందిరం వద్ద జరిగే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా నిర్వాహకులు కోరారు.

భగవద్గీత పఠనంతో మానసిక ప్రశాంతత



భగవద్గీత శిక్షణ శిబిరంలో చిన్నారులు, పెద్దలు

మునగపాక: భగవద్గీతను పఠించి, దాని భావాన్ని అవగాహన చేసుకుంటే చాలా మానసిక చింతల్ని దూరంగా తరిమేయవచ్చని ఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమం మేనేజింగ్ ట్రస్టీ సూరిశెట్టి సుషుమ్న తెలిపారు. మండలంలోని తోటాడ ఓంకార పీఠంలో నిర్వహిస్తున్న భగవద్గీత శ్లోకాల శిక్షణ తరగతులకు విశేష స్పందన వస్తోంది. తోటాడ, గవర్ల అనకాపల్లి, సిరసపల్లి, నారాయుడుపాలెం తదితర గ్రామాల నుంచి విద్యార్థులు, మహిళలు శిక్షణలో పాల్గొంటున్నారు. భగవద్గీత శ్లోకాలు నేర్చుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను సుషుమ్న వివరించారు. గీతా శ్లోకాల పఠనంతో మేధాశక్తి పెరుగుతుందన్నారు. క్రమం తప్పకుండా భగవద్గీతను పఠిస్తే పిల్లల్లో మరింత ఉత్తేజం కలుగుతుందన్నారు. భగవద్గీత విశిష్టతను అందరికీ తెలియజేయాలనే ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎంహెచ్ స్కూల్లో అబ్దుల్ కలాం సేవా సంఘం సహకారంతో ఆదివారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు జరిగాయి. సోమవారం జరిగే గాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహించినట్లు సంఘం వ్యవస్థాపకుడు ఆళ్ల ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు నేడు బహుమతి ప్రదానం చేయనున్నామన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం



కనకమహాలక్ష్మి వీధిలో పొక్లెయిన్ సాయంతో డ్రైనేజీ తవ్వకాలు

కశింకోట : కశింకోటలోని కనకమహాలక్ష్మి వీధిలో ఆక్రమణలు తొలగించి డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆదివారం శ్రీకారం చుట్టారు. పొక్లెయినర్‌తో కాలువ తవ్వకాలు చేపట్టారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంజూరు చేసిన నిధులతో పనులు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు.

స్వచ్ఛతా పనుల్లో చేయి చేయి కలిపి...

ఊరూరా ప్రజలు తమ పరిసరాల పరిశుభ్రతకు నడుం బిగించారు. గాంధీ మహాత్ముని జయంతికి ఒక రోజు ముందుగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగమయ్యారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లు, కాలువల్ని శుభ్రం చేశారు. స్వచ్ఛ ఆంధ్రకు ప్రతిన బూనారు.

- పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం
- ఊరూరా 'స్వచ్ఛతా హీ సేవా'లో ప్రజలు

ఎస్.రాయవరం : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులు దరిచేరవని ఎంపీపీ కోనలోవలక్ష్మి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ పెనుగొల్లు గ్రామంలో చీపురు పట్టుకుని శుభ్రం చేశారు. గ్రామ పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి పలు వీధులు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడకుండా పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలన్నారు. కొరుప్రోలు, ఎస్.రాయవరం, తిమ్మాపురం తదితర గ్రామాల్లో సచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచ్‌లు భూపతి అప్పారావు, కర్రి సత్యనారాయణ, సూరివేణి, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, రమేష్, రామలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో గ్రామాలు సస్యశ్యామలం

మునగపాక : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోరారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం తోటాడ పంచాయతీలో ర్యాలీ నిర్వహించారు. గ్రామాలు సస్యశ్యామలంగా తయారు కావాలని, ఇందుకు ప్రజల సహకారం కావాలని అన్నారు. ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కాండ్రేగుల లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకులు పాలమరశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నేత బుద్ద రమేష్, కన్వీనర్ పాలమరశెట్టి జగదీష్‌బాబు పాల్గొన్నారు.

నక్కపల్లి: ఆరోగ్య సంరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా అభియాన్ కార్యక్రమాన్ని అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులతో కలిసి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఆవరణలో పిచ్చిమొక్కల్ని తొలగించి, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల్ని నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. గ్రామాల్లో వీధులు, కాలువలను శుభ్రంగా ఉంచాలన్నారు. తడి పొడి చెత్తను వేర్వేరుగా వేయాలన్నారు. రోడ్లకి ఇరువైపులా, సామాజిక భవనాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద మొక్కలను నాటాలన్నారు. దేవవరం, ముకుందరాజుపేట, సీహెచ్ లక్ష్మీపురం, వేంపాడు, గొడిచెర్ల, ఉద్దండపురం తదితర గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఎంపీడీవో శ్రీనివాసరావు, పరిపాలన అధికారి సీతారామరాజు, సర్పంచ్‌లు రత్నకుమారి, రాజబాబు, వియ్యపు శ్రీను, కార్యదర్శి రాజశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్.రాయవరంలో స్వచ్ఛతా కార్యక్రమంలో చేతులు కలిపిన సర్పంచ్ అప్పారావు

- జాతీయ రహదారిపై వేంపాడు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం జరిగింది. స్థానిక సీఐ అప్పన్న ఆధ్వర్యంలో టోల్‌ప్లాజా సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. టోల్ ప్లాజా మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌశిక్ ప్రాజెక్ట్స్ ప్రతినిధి శ్రీపాద ప్రణవ్, టోల్ ప్లాజా మేనేజర్ రాజేష్, సిబ్బంది శ్రీనివాస్, కృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాయకరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు గ్రామాల్లోని వీధుల్ని పరిశుభ్రం చేశారు. మండలంలోని మంగవరం, మాసాహేబుపేట తదితర గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. కార్యక్రమంలో మంగవరం, మాసాహేబుపేట సర్పంచ్‌లు వంగలపూడి సరస్వతీ రామారావు, గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు గూటూరు విజయలక్ష్మి రామగోవిందు, కొంతం నరేష్, నాయకులు పెనుమత్స నాగేశ్వరరావు, కోనే పుత్రరావు, కోనే శివ, కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



నక్కపల్లి జెడ్పీ హైస్కూల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

కోటవురట్ల: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రధాని మోదీ పిలుపు మేరకు ఒక రోజు ముందుగా ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని కె.వెంకటాపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు పైల నాని ఆధ్వర్యంలో స్థానిక యువకులు శ్రమదానం చేశారు. జెడ్పీ హైస్కూల్, పీహెచ్‌సీ పరిసరాలలో పేరుకుపోయిన పిచ్చి మొక్కల్ని తొలగించారు. స్వచ్ఛ గ్రామం కోసం మేము సైతం అంటూ నినదించారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని తంతడి గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు మహాత్మా గాంధీ జయంతి నేపథ్యంలో ఈ స్వచ్ఛతా కార్యక్రమం చేపట్టినట్లు ఆ పార్టీ నియోజక కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు తెలిపారు. కార్యక్రమంలో మేరుగు కాసుబాబు, యండపల్లి రాజు, బండారు కన్నంనాయుడు, సారథి రాంబాబు పాల్గొన్నారు.

- అచ్యుతాపురం మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు శ్రమదానం, ర్యాలీల ద్వారా ప్రజల్ని చైతన్య పరిచారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ప్రధాని మోడీ పిలుపు మేరకు మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమం చేపట్టారు. గ్రామాల్లో ఒక గంట పాటు శ్రమదానం నిర్వహించడం, ప్రజలకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ఉద్దేశ్యం.



వేంపాడు టోల్‌ప్లాజా వద్ద స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న సీఐ అప్పన్న



కె.వెంకటాపురంలో పిచ్చి మొక్కల్ని తొలగిస్తున్న యువకులు



తోటాడలో స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ ప్రారంభిస్తున్న సర్పంచ్ మంగవేణి



మాసాహేబుపేటలో స్వచ్ఛతా హీ సేవలో పాల్గొన్న స్థానికులు



తంతడి వీధిలో స్వచ్ఛతా కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు



మదుతూరులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



అచ్యుతాపురంలో స్వచ్ఛతా ప్రతిజ్ఞలో పాల్గొన్న ప్రజలు

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు



డయాలసిస్ రోగికి రూ.10 వేల పింఛను అందజేస్తున్న సర్పంచ్ మంగలక్ష్మి



సీతంపాలెంలో పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ గోవిందు, వలంటీర్లు

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేస్తామని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి అన్నారు. తిమ్మరాజు పేటలో ఆదివారం పింఛన్ల పంపిణీలో భాగంగా మూర్తి అప్పారావు అనే వ్యక్తికి డయాలసిస్ పింఛను రూ.10వేలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. ప్రజలు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాలన్నారు. ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, ఎస్సీ సెల్ సహాయ కార్యదర్శి ముప్పిడి కుమారస్వామి, వార్డు మాజీ సభ్యులు అప్పలనరసమ్మ, గృహసారథి భీమిశెట్టి రాంప్రసాద్, వలంటీర్ ముప్పిడి సాయిలక్ష్మి పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం మంజూరు చేసిన పెన్షన్లను ఆదివారం పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆదివారం సెలవు రోజైనప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన పింఛన్లను లబ్ధిదారులకు అందించినట్లు ఎంపీటీసీ గోవిందు తెలిపారు. అన్ని గ్రామాల్లో పెన్షన్ పంపిణీ యథావిధిగా కొనసాగినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు వెల్లడించారు.

సీనియర్ సిటిజన్‌లకు సన్మానం



నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ సిటిజన్‌లను సన్మానిస్తున్న అధికారులు



సీనియర్ సిటిజన్‌లను సత్కరిస్తున్న దృశ్యం

నక్కపల్లి : వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం నక్కపల్లికి చెందిన పలువురు సీనియర్ సిటిజన్‌లను రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు ఘనంగా సత్కరించారు. 80 ఏళ్ల దాటిన సామాజిక కార్యకర్త నవర నూకరాజుశర్మ, కొల్నాటి అప్పారావు, సూర్యారావులను మండల పరిషత్ పరిపాలన అధికారి సీతారామరాజు, డిప్యూటీ తహల్దార్ నీరజలు ఈ ముగ్గురిని దుశ్శాలువతో సత్కరించారు. మంచి ఆహార నియమాలు ఆరోగ్యసూత్రాలు పాటించడం వల్ల ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని వారు పేర్కొన్నారు.

నిజాయితీపరులను ఎన్నుకోవాలి

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని ఇన్‌ఛార్జి తహసీల్దార్ వినయ్‌కుమార్ కోరారు. ఓటరు దినోత్సవంలో భాగంగా ఆదివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ సిటిజన్లకు సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు విలువ తెలుసుకోవాలన్నారు. ఎన్నికల్లో నిజాయితీ కలిగిన వారిని ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోవడం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. రీ-సర్వే డీటీ చిన్నయ్య పడాల్, సీనియర్ సహాయకులు నాగేశ్వరరావు, వీఆర్వో శేషగిరి కార్యక్రమంలో పాల్గొన్నారు.

వాడవాడలా వినాయక అన్న సమారాధనలు



మునగపాకలో అన్న సమారాధన ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



తిమ్మరాజుపేటలో గణేష్ సంఘం ఆధ్వర్యంలో అన్న సమారాధన

మునగపాక : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. మునగపాక బీసీ కాలనీ, వెలగావారి సంఘం, దళితవాడ, బైపాస్ రోడ్డులోని కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక అన్న సమారాధనల్లో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న సమారాధనలు ప్రారంభించారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి రామ్మోహనరావు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ బొడ్డేడ అప్పలనాయుడు తదితరులు వినాయక అన్న సమారాధనల్లో పాల్గొని పూజలు చేశారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): వినాయక చవితి మహోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. గత రెండు రోజుల నుంచి మండలంలో వినాయక నిమజ్జనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం పలు చోట్ల అన్న సమారాధన చేశారు. తిమ్మరాజుపేటలో గణేష్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

గణేశుని లడ్డూకి రూ.60 వేలు



వేలం పాటలో లడ్డూను దక్కించుకున్న చందు

ఎస్.రాయవరం: అడ్డురోడ్డులో గణేశుని లడ్డూ వేలంలో రూ.60 వేల ధర పలికింది. 26 ఏళ్ల వైభవం పేరిట నిర్వహిస్తున్న గణపతి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి 26 కేజీల లడ్డూకి వేలం పాట నిర్వహించారు. స్థానిక భక్తుడు కర్రి చందు అత్యధికంగా రూ.60 వేలుకు పాటను దక్కించుకుని స్వామి ప్రసాదం తీసుకువెళ్లారు. ఈ క్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు లడ్డూదాతను, వేలంలో లడ్డూ దక్కించుకున్న భక్తుడిని ఘనంగా సత్కరించారు. పెనుగొల్లు గ్రామంలో గణపతి మండపం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. కొరుప్రోలు కుమ్మరివీధిలో గణపతిని భారీ ఊరేగింపుతో నిమజ్జనం చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం నేడు

కశింకోట : స్థానిక కస్పావీధి రామాలయం వద్ద సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల పక్షోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే శిబిరం మధ్యాహ్నం 2 గంటలకు ముగుస్తుందన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు పాల్గొని రోగులను పరీక్షిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు కూడా ఉచిత సేవలందిస్తారన్నారు. ఈహెచ్‌ఎస్, ఆధార్ కార్డులు తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు.

బొడ్డేడకు ఆత్మీయ సత్కారం

అనకాపల్లిటౌన్ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో ఆదివారం పలువురు పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. ప్రసాద్‌ను సత్కరించిన వారిలో సుంకరమెట్ట సత్యనారాయణస్వామి దేవస్థానం ఛైర్మన్ కె.ఎం.నాయుడు, రాష్ట్ర వైద్య విభాగం కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనర్సింహారావు ఉన్నారు.

అమూల్ డెయిరీ ప్రారంభం



కె.వెంకటాపురంలో అమూల్ డెయిరీని ప్రారంభించిన ఎంపీటీసీ రత్నం

కోటవురట్ల: మండలంలోని కె.వెంకటాపురంలో అమూల్ పాల సేకరణ కేంద్రాన్ని ఎంపీటీసీ సభ్యురాలు కాళ్ల రత్నం ఆదివారం ప్రారంభించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని కొనియాడారు. రైతు భరోసా ద్వారా పంటల సాగుకు ఆర్థిక సాయం చేస్తూనే, పాడి పరిశ్రమతో రైతులకు మరింత మేలు జరిగేలా అమూల్‌తో ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. మిగతా డెయిరీల కంటే అమూల్ ఎక్కువ ధరను చెల్లిస్తోందన్నారు. రైతులు అధికంగా పాలను ఉత్పత్తి చేసి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లు చిట్టిబాబు, పైల నాని, సత్యనారాయణ, పాడి రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ గురువులకు సన్మానం



సత్కారం పొందిన ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, నటుడు సత్తిపండు

ఎస్.రాయవరం: విద్యా బోధనలో వినూత్న పద్ధతుల అమలుతోపాటు, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసిన గురువులు అభినందనీయులని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. ఇటీవల జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న టీచర్లను పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో ప్రభుత్వం తీసుకువచ్చిన ఆధునిక మార్పులకు అనుగుణంగా బోధన చేసి మరింత గౌరవం పొందాలని అభిలషించారు. కార్యక్రమంలో వెండితెర, బుల్లితెర నటుడు జబర్దస్త్ సత్తిపండు, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, మండల విద్యాశాఖ అధికారులు పి.అప్పారావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



ఒంపోలు సచివాలయ కన్వీనర్ సూర్యనారాయణను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పాటు పడాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఒంపోలు సచివాలయ కన్వీనర్, పార్టీ యువజన విభాగం నాయకుడు సరాలశెట్టి సూర్యనారాయణ జన్మదిన వేడుకలు స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నట్లు తెలిపారు. యువజనులంతా రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి, జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



కొండకర్ల గెస్ట్ హౌస్ వద్ద ఆత్మీయ కలయికలో మునగపాక హైస్కూల్ 1979-80 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

అచ్యుతాపురం(అనకాపల్లి): ఏరా ఎన్నాళ్లయిందిరా. ఎలా ఉన్నావు? అంతా కుశలమేనా? పిల్లలు ఎలా ఉన్నారు.. అంటూ ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాలతో మునగపాక ఉన్నత పాఠశాల 1979-80 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు సందడిగా గడిపారు. చిననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల గెస్ట్ హౌస్ వద్ద సంబంధిత బ్యాచ్ విద్యార్థుల రాకతో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

50 మంది పాల్గొన్న ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఇప్పటికే రిటైరయిన ఆరుగురు మిత్రుల్ని సన్మానించుకున్నారు. 43 ఏళ్ల క్రితం పాఠశాలలో చేసిన సందడి, అప్పటి ఉపాధ్యాయుల ఊసులు, ప్రస్తుత కుటుంబ బాధ్యతలు, పిల్లల ఎదుగుదల, కష్టసుఖాలను పంచుకుంటూ సాయంత్రం వరకూ సేద దీరారు.